రంగారెడ్డి । వికారాబాద్ । మేడ్చల్
వార్త



## వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



**తాండూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :** తాండూరులోని క్రిష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో శ్రీ కృష్ణుని వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల శ్రీకృష్ణ, గోపికల వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. కృష్ణాష్టమిని పుంస్కరించుకొని విద్యార్థులు శ్రీకృష్ణుడు, గొల్లభామల వేషధారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సంవత్సరం అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలకు ఎల్లవేళల సహకరించే విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెరుగుబసంతం కార్యక్రమం నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగు నీళ్లు చల్లుకుంటూ ఆనందంగా ఉట్టిని పగులగొట్టారు. పాఠశాల డైరెక్టర్ వెంకటేశం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆలేడ్ లో ఘనంగా హోమం కార్యక్రమం..

**దుద్యాల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆలేడు గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా హోమ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు ప్రతి సంవత్సరం ఇక్కడ హోమ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అనంతరం హోమం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.



ఆలెడ్ గ్రామంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

## వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### మేడ్చల్ ఎసిపిశంకర్ రెడ్డి



**మేడ్చల్, ఆగస్టు17. ప్రభాతవార్త :** వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకునే విధంగా అందరూ సహకరించాలని మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తెలిపారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో వినాయక చవితి పీస్ కమిటీ సభ్యులు, వినాయక మండపాల నిర్వాహకులు, వివిద పార్టీ నాయకలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో వినాయక చవితి వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల నడుమ వినాయక చవితిని చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫైర్, విద్యుత్, ఆర్ అండ్ బి, త్రైత అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ వేడుకను చేసుకోవాలన్నారు. వేడుక సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని వారే పూర్తి బాధ్యత వహించే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సైలు యతీష్ చంద్ర, అనిత, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా, వివిద పార్టీల నాయకులు విష్ణుచారీ, సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, పాతూరి సుధాకర్ రెడ్డి, కౌడే మహేష్, నర్సింగ్ రావు, శివకుమార్, సంతోష్ గౌడ్, రాకేష్, శ్రీధర్, వెంకటేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను కలిసిన్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి



**కోట్‌పల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త;** గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నాడు హైదరాబాద్‌లో అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. మోత్కుపల్లి గ్రామం నుంచి వికారాబాద్ వేళ్ళే రోడ్డు పూర్తిగా అద్వనంగా మారిందని వాహనలు రాకపోకలు పోవడానికి ఇబ్బందులు గురి అవుతుందని వివరించడం జరిగిందన్నారు అదే విధంగా గ్రామంలో ఇండ్లు లేని పేదలకు రెండో విడుతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వివరించడం జరిగిందని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యండి, ఖాజా, లక్ష్మీపూరం భూపతిరెడ్డి, సూడె శ్రీనివాస్‌రెడ్డి, యండి, హైమద్, సూడె రంగారెడ్డి, అమీర్ పటేల్, లక్ష్మీపూరం నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూరని బాబు, బేగరి శ్రీకాంత్, పొట్ట రాంచెంద్రయ్య, తలారి బాబు, తదితరులు పాల్గొన్నారు,

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెళ్లికి హాజరైన దేప భాస్కర్‌రెడ్డి.



**మహేశ్వరం, ఆగస్టు 17 ప్రభాత వార్త :** టీపీసీసీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి కుమారుడు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి, దివ్య రెడ్డిల పెళ్లికి టిపిసిసి సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి హాజరైయ్యారు. వివాహ కార్యక్రమంలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ,మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చరణ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, జానకి రామ్, కందుకూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహాచారి, సుబాన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఉరివేసుకోని ఓ వ్యక్తి మరణం

**మొయినాబాద్, అగస్టు 17, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఓ వ్యక్తి మరణించిన సంఘటన మొయినాబాద్ పోలిస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది, పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన వెంకటేష్(48) వృత్తి డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు, మృతుడి భార్య కావలి వందన (31) ఇచ్చిన పిర్యాదు మేరకు తేది 17.08.2025. నాడు ఉదయం సమయంలో ఇతను ఇంట్లో సీలింగ్‌కు ఉరివేసుకోని మరణించినట్లు తెలిపారు, పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంబురామన్న జాతరకు నేడు ఎమ్మెల్యే రాక

**పెద్దేముల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం తట్టెపల్లి అటవీ ప్రాంతంలో వెలిసిన అంబురామేశ్వర జాతరకు శ్రావణ చివరి సోమవారం నేడు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రానున్నట్లు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొండపురం గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విచ్చేసి స్వామి వారి దర్శనం చేసుకుంటారని అన్నారు. తట్టెపల్లి అంబురామన్న జాతరకు ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు,పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హజరై స్వామి వారి కరుణ కటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు.

# చెరువు కబ్జాపైనే ప్రజా ప్రతినిధుల ఫోకస్

చెరువు చుట్టూ చెత్తచెదారం.
- డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న ఊర చెరువు.
కండ్లు మూసుకున్న గ్రామ పంచాయతీ అధికారులు.







**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 17 ప్రభాతవార్త :** ఈ ఊర చెరువు చుట్టూ ఉన్న భూములు ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వచ్చినప్పటికి ఇరిగేషన్ శాఖ అధికారులు ఏనాడు కూడా ఈ చెరువును సందర్శించి ఎఫ్.టి.ఎల్ సరిహద్దులు పెట్టకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దాదాపుగా 50శాతం భూములను వరదనీటిలో ఉన్న వాటిని గత రెండు మూడు సంవత్సరాల క్రితం అమ్మకాలునిర్వహించి భారీగా డబ్బులు దండుకున్నారు. గత పది సంవత్సరాలుగా వర్షాలు పడకపోవడంతో రియల్ వ్యాపారులకు, ఈ చెరువు భూములు అమ్మకానికి కొనడానికి కేంద్రంగా మారింది. పట్టా భూముల సాకుతో ఈ భూములను లక్షల్లో కొనుగోలు చేసి కోట్లల్లో అమ్మకాలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎఫ్.టి.ఎల్ పరిధిలో ఉన్న భూములకు పూర్తిగా చెరువు మధ్యలో ప్రికాస్ట్ ఫెన్సింగ్ వేయడం సరిహద్దు రాళ్లతో ఎవరికి వారు అమ్మకాలు చేసి ఈ చెరువును పూర్తిగా ఆదీనంలోకి తీసుకోవడంతో గ్రామ పంచాయతీలో గతంలో పనిచేస్తున్న కార్యదర్శి, కారోబారితో పాటు ఇతర సిబ్బంది కూడా ఈ చెరువు ఆక్రమాలపై ఫిర్యాదు చేసిన ఏనాడు కూడా ఈ చెరువును రక్షించిన పాపాన పోలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక కొత్తగా గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్న సుజాతకు కూడా పలుసార్లు ఫిర్యాదు చేసిన ఈ చెరువులోని మలినాలను చెత్తచేదారం పెళ్లిళ్ల పేరంటాలు చేసి వ్యర్థ పదార్థాలన్నిటిని ఈ చెరువులో ఆటోలు, ట్రాక్టర్లు ఇతర ద్విచక్రవాహనాలపై వేస్తున్న విషయాన్ని దృష్టికి తెచ్చిన ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ చెరువు రక్షణలో భాగంగా ఈ చెరువు కట్టపై హెచ్చరిక బోర్డులు గాని సీసీ కెమెరాలు గాని ఏర్పాటు చేయడం కానీ అక్కడ గ్రామ పంచాయతీ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి చెత్తా వేస్తున్నటువంటి వ్యక్తులకు చాలాన్లు వేయడం కానీ, వారిపై గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టకపోవడం గ్రామ పంచాయతీలో ఆయా బస్తీల్లో ప్రధాన వీదుల్లో ఈ చెరువు రక్షణ విషయంపై దండోరా వేయించడం వంటి చర్యలు చేపట్టి ఉంటే ఈ చెరువు ఇంత మురికిగా డంపింగ్‌గామారకుండేదని పలువురు అభిప్రాయపడ ఎతున్నారు.

ఈ చెరువు అన్యాక్రాంతం అయ్యేది కాదని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ అదికారులు ఇరిగేషన్ నిర్లక్ష్యంపై చెరువు భూముల కబ్జాపై ప్రత్యేక కథనం రేపటి సంచికలో గతంలో పనిచేసిన అధికారులు కొంతమంది రాజకీయ నాయకులకు ప్రజాప్రతినిధులకు ఆడుగులకు మడుగులు ఈ చెరువులను కాపాడుకోవడంలో అడుగడుగునా వైఫల్యం చెందారు. అధికారుల పనితీరును గతంలో పలుసార్లు స్థానిక యువజన సంఘాల నాయకులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు రెవెన్యూ అధికారులకు వితని పత్రం ఇచ్చిన ఈ చెరువును కాపాడుకోవడంలో ఘోరంగా వైఫల్యంచెందారు. తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారులు సకాలంలో ఈ చెరువును సందర్శించడం గాని వాటిని పునర్ నిర్మించడంలో ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ, ఎంపిడివో , స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది ఈ చెరువు కాపాడుకోవడంలో ఎలాంటి శ్రద్ధ కనపరచకపోవడం వల్ల మహేశ్వరంలోని ఊర చెరువు ఒక డంపింగ్ యార్డ్‌గా చెత్తకుప్పలకు నిలయంగా పురాతన ఇళ్లను కూల్చివేసిన పెంకలు, స్లాబులతో గత పది సంవత్సరాల్లో ఏనాడు కూడా ఈ ఊర చెరువులో తరచుగా వేయడంవల్ల ఈ చెరువు పూర్తిగా ఒక డంపింగన యార్డ్‌గా మారుతున్న స్థానికంగా ప్రాతినిద్యం వహించిన సర్పంచులు గత పది సంవత్సరాల్లో ఏనాడు కూడా ఈ ఊర చెరువును సందర్శించిన పాపానపోలేదంటే ఈ చెరువు మీద ఈ గ్రామ ప్రజల మీద ఎంతటి ప్రేమ కనబరిచారు. ఒక్కసారి ఈచెరువును సందర్శించి చూస్తే ఆశ్చర్యపోవాల్చిందే. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ ఊర చెరువులోకి వరదనీరు రావడంతో కొంత ఈ చెరువు పరిసర ప్రాంతాలన్నీ ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. ఈ చెరువు నిండడం వల్ల చుట్టు ప్రక్కల బోరుబావుల్లో భూగర్భజలాలు కొంత పెరగడంతో ఆ రైతుల బోర్లు 24 గంటల పాటు ఆపకుండా పోయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పెద్దముల్ మండలంలోని తట్టెపల్లి అంబురామేశ్వరుడి



## భారీ పోలీసు బందోబస్తు : ఎస్ఐ

**పెద్దేముల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** శ్రావణమాసం ప్రారంభం నుంచి ముగింపువరకు భక్తులతో కిటకిటలాడుతు, తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోని దట్టమైనఅటవీ ప్రాంతంలో ప్రశాంతమైన వాతవరణంలో సకల జనుల కోర్కెలు తీర్చే కొంగు బంగారమై వెలిసిన అంబురామేశ్వరుడు పెద్దేముల్ మండల పరిధిలోనితట్టెపల్లి ప్రాంతంలో వెలిసింది. శ్రావణమాసం చివరి సోమవారం(నేడు) నిర్వహించే అంబురామన్న జాతరకు తెలంగాణలోని వికారాబాద్, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం, బీదర్, సేడెం, చించోలి తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. శ్రావణమాసం నెల రోజుల పాటు నియమనిష్టలతో చేసిన దీక్షలను స్వామివారిని దర్శించిన అనంతరం విరమింపజేస్తారు. జాతరకు విచ్చేసేభక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్ని రకాల ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటి అధ్యక్షులు వెంకటేశం తెలిపారు. ఆలయ చరిత్ర : త్రేతాయుగంలో శ్రీ రాముడు వనవాస సమయంలో సీతమ్మకు దాహం తీర్చడానికి రామబాణం భూమిలోకి కొట్టి నీటికి బయటకు తీయగాఆ నీటిని ఉపయోగించి శివుడిని తలచుకొని శివలింగాన్ని ప్రతిష్టించి శ్రీరాముడు పూజలు నిర్వహించారని చరిత్రలో ఉంది.

**ఐదాకుల పుండికూరకు ఎంతో ప్రత్యేకత :** శ్రీ అంబురామేశ్వర ఆలయ పరిసనాల్లో లభించే ఐదు ఆకుల పుండికూర ఎంతో ప్రసిద్ది చెందింది. స్వామివారి ఆలయ పరిసరాల్లో సహజ సిద్దంగా లభించే ఐదు ఆకుల పుండికూర వంటల్లో వేసుకొని తింటే స్వామివారి కృప, కరుణకటాక్షాలు లభిస్తాయని భక్తుల నమ్మకం, జాతర ఉత్సవాలకు గట్టి పోలీసు బందోబస్తు : ఎస్ఐ వేణుకుమార్‌పెద్దేముల్ మండల పరిధిలోని తట్టెపల్లి అంబురామేశ్వర జాతర ఉత్సవాలకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు. జాతరఉత్సవాల సందర్భంగా ఏలాంటి అవాంచనీయమైన సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో జూదం, మట్కా ఆడటం, మద్యం, మాంసం విక్రయాలు జరుపడం నిషేదమని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైన ఉల్లంగిస్తే చట్టారిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరకువిచ్చేసే భక్తులు, ప్రజలు, ఆలయ కమిటి సభ్యులకు పోలీసులకు సహకరించాలని కోరారు.



# ప్రశాంతంగా గణేష్ చతుర్థి జరుపుకోవాలి :సిఐ



,జీనోమ్‌వ్యాలీ పిఎస్ సిఐ గురువయ్య
..తుర్కపల్లిలో జరిగిన వినాయక ఉత్సవాలు
నిర్వాహణపై అవగాహన సమావేశం

**శామీర్‌పేట, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నిబంధనలు పాటిస్తూ వినాయక ఉత్సవాలను నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ వినాయకుల మండపాలను ఏర్పాటు చేయాలని జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ గురువయ్య స్పష్టం చేశారు. శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలోని బాలాజీ పంక్షన్‌హాల్‌లో జీనోమ్‌వ్యాలీ పోలీసుల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల నిర్వాహణపై నిర్వాహకులకు అవగాహన సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా జీనోమ్‌వ్యాలీ పోలీస్ ఇన్స్‌పెక్టర్ గురువయ్య మాట్లాడుతూ రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగ నిర్వహించే వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలని నిర్వహాకులకు స్పష్టం చేశారు. రోడ్డు మధ్య ప్రదేశాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసి వివాదస్పద వాతావరణం కల్గించవద్దని, ట్రాఫిక్‌కు కూడ అంతరాయం కల్గించవద్దని ఆయన సూచించారు. పశువులు, వీధికుక్కలు మండపాల దగ్గరకు రాకుండ చూడాలన్నారు. నిర్వాహకుల వలంటీర్ల ఫోటో ఐడి తప్పనిసరి ఉండాల్సి ఉంటుందన్నారు. మండపాల వద్ద టపాకాయలు, పేలుడు సామాగ్రి ఉంచరాదని అన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏసిపి అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లు ఉపయోగించరాదన్నారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్లు సంబంధిత అధికారులను సంప్రదించి తీసుకోవాలన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థన మందిరాలకు ఇబ్బంది కలుగకుండ శబ్ద పరిమితి పాటించాలని అన్నారు. రాత్రి 10గంటల తరువాత లౌడ్‌స్పీకర్లు, భాణసంచా నిషేదం అని, డిజె పెట్టవద్దని, డిజె పెట్టటానికి కూడ అనుమతి లేదని సిఐ గురువయ్య స్పష్టం చేశారు. నిర్వాహకులు నియమాలు పాటించాలని, వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు. దీనిలోపిఎస్ఎస్ఐ, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, యువకులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

..పేట్‌బషీరాబాద్ సిఐ విజయవర్దన్
.ప్రశాంతంగ నిర్వహించాలి..నిబంధనలు పాటించాలి

వినాయకఉత్సవాలనుయూత్‌సభ్యులు భక్తి భావంతో జరుపుకోవాలని, నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగ నిర్వహించాలని పేట్‌బషీరాబాద్ సిఐ విజయవర్ధన్ సూచించారు. శామీర్‌పేట మండలంతూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్ రామాలయం వద్ద త్వరలో జరుగనున్న వినాయక ఉత్సవాల నిర్వాహణపై నిర్వాహకులకు, యువకులకు ప్రశాంతత కోసం పేట్‌బషీరాబాద్ సిఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పేట్‌బషీరాబాద్ సిఐ విజయవర్ధన్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు ప్రశాంతంగ నిర్వహించటానికి యువతకు అవగాహన కల్పించటం జరుగుతుందని, పోలీసులు సూచనలు, సలహాలు పాటించాలని అన్నారు. ఆ రోజులలో వేడుకలు, ఊరేగింపులు, సంగీతం, ఆహారం ఉండేవి కావన్నారు. వృత్తి వారీగ చందాల ద్వారా అవి నిర్వహించబడినట్లు వివరించారు. ప్రతి ఒక్కరు ఐక్యమత్యంగా ఉండాలని, ఆ ఆలోచనతో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు. అన్ని యూత్‌ల సభ్యులు గణేశ్ నవరాత్రి ఉత్సవాలను సామరస్యంగ ఎటువంటి గొడవలు లేకుండా 11రోజుల వరకు ఉత్సవాలు నిర్వహించి ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలు పూర్తిచేయాలని సిఐ విజయవర్ధన్ అన్నారు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ సురేందర్‌రెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పి.నర్సింహ్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ పచ్చిమాండ్ల నర్సింగ్‌రావుగౌడ్, రామాలయం ధర్మకర్తలు గుడిసేని హరికృష్ణ, తూంకుంట జగదీశ్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అన్ని యూత్‌ల సభ్యులు, పాల్గొన్నారు.

## బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కలెక్టరేట్ ఉద్యోగి

### -దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన కాలనీవాసులు

**వికారాబాద్, ఆగష్టు 17, ప్రభాతవార్త :** ఆడుకుంటున్న ఓ బాలికపై కలెక్టర్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో కాలనీవాసులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీప కాలనీలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కో ఆపరేటివ్ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ గా పరిగి నియోజకవర్గానికి చెందిన నరేందర్ విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం కృష్ణాష్టమి కావడంతో కాలనీవాసులు వారి పిల్లలను, గోపిక, చిన్ని కృష్ణుల వేషధారణలతో పండుగ సంబురాలు జరుపుకొన్నారు. పండుగ సంబురాల అనంతరం కొంతమంది చిన్నారి బాలికలు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆడుకునేందుకు వెళ్ళారు. ఆడుకుంటున్న చిన్నారి బాలకిలను నరేందర్ గమనించాడు. వారికి మాయ మాటలు చెప్పి దగ్గరకు తీసుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. నరేందర్ చేష్టలకు వణికిపోయిన ఆ బాలికలు అక్కడి నుంచి వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లిదండ్రులకు వద్దకు వచ్చి జరిగిన సంఘటనకు వివరించారు. కోపంతో ఊగిపోయిన తల్లిదండ్రులు, కాలనీవాసులు నరేందర్‌ను పట్టుకోవడానికి కలెక్టర్ కార్యాల ఆవరణలో గాలించగా, నిందితుడు పొదల చాటున దాక్కున్నాడు. ఎట్టకేలకు కాలనీవాసులు నింధితుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సాంప్రదాయ పద్ధతులో ఉత్సవాలు జరగాలి,

### మొయినాబాద్ సిఐ పవన్ కుమార్ రెడ్డి,

**మొయినాబాద్, అగస్టు 17, ప్రభాతవార్త :** వచ్చే గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఉరేగించేటప్పుడు డిజేలు వద్దని, గతంలో మన పెద్దలు చేసిన విదంగానే సాంప్రదాయ పద్దతులో, భక్తి శ్రద్దలతో నిమర్జన ఉత్సవాలు చేస్తే ఎంతో బాగుంటుందని ప్రతి ఒక్కరు చేయాలని అన్నారు, ఆదివారం ఆయన వచ్చే వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాల కమిటిల నాయకులతో మొయినాబాద్ సిఐ పవన్‌కుమార్ రెడ్డి, సమావేశం ఏర్పాటుచేశారు, ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరు అనుమతులు తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద సీసీకెమరాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు.

ఏ ఒక్కరికి ఇబ్బందులు కలగకుండా భక్తిశ్రద్దలతో వినాయకచవితిని చేయాలన్నారు, డిజెపాటలతో కాకుండా నాటి మన పెద్దలు నిర్వహించిన సాంప్రదాయ పద్దత్తితో వేడుకలు జరుపుకోవాలని వినాయక చవితి ఉత్సవాల కమిటి అద్యక్షులతో సమావేశం ఏర్పాటుచేసి తెలిపారు, కచ్చితంగా మండపాల వద్ద సిసికెమరాల నిఘ ఉంటే ఎలాంటి ఇషు జరిగిన ముందస్తు జాగ్రత కోసం కెమరాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు



నూతన అధ్యక్షులు ఉత్తరపల్లి కృష్ణను సన్మానించిన గంజి రఘునాద్

## పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

**కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఉత్తరపల్లి కృష్ణ**

**మెహిదీపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త :** కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా ఉత్తరపల్లి కృష్ణ నియమితులైనారు. ఈ మేరకు ఆదివారం కార్వాన్ మార్కొండయ భవన్‌లో నిర్వహించిన పద్మశాలి సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా రెండవ సారి ఎన్నుకున్నారు. జనరల్ సెక్రెటరీగా తీరాందాస్ గోపాల్, కోశాధికారిగా పల్లె పాండు, మహిళా అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తరపల్లి కృష్ణ, కార్వాన్ పద్మశాలి యువజన సంఘం గంజి రఘునాద్‌లు మాట్లాడుతూ... పద్మశాలీల అభివృద్ధికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యా, వ్యాపారం, రాజకీయంగా మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభివృద్ధి చెందిన పద్మశాలీ లు కులంలోని నిరుపేదలకు చేయూతనివ్వాలని కోరారు. అనంతరం అధ్యక్షులు ఉత్తరపల్లి కృష్ణను యువజన సంఘం అధ్యక్షులు గంజి రఘునాద్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు దోర్నాల ప్రసాద్, దావత్ నర్సింగ్, ముదిగొండ యాదగిరి, చిలువేరు క్రాంతి, మాస శ్రీను, రాజులు పాల్గొన్నారు.



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

## బిజెపి జిల్లా కార్యదర్శిగా కళ్యాణి దుర్గాప్రసాద్

**మూసాపేట్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీకి చెందిన సీనియర్ నాయకులు కళ్యాణి దుర్గాప్రసాద్ రంగారెడ్డి అర్బన్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎన్నో ఏళ్లుగా వివిధ రూపాల్లో పార్టీకి, జిల్లా ప్రజలకు విశేష స్థాయిలో సేవలందిస్తున్న దుర్గాప్రసాద్‌ను జిల్లా కార్యదర్శిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా పని చేస్తూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరిని కలుపుకుని ముందుకు సాగుతానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పని చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శిగా నియమితులైన దుర్గాప్రసాద్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వాంబే కాలనీ డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని వాంబే కాలనీలో పగిలిన డ్రెయినేజీ పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మతులు చేయించాలని బిఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు డిమాండ్‌చేశారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించి డ్రెయినేజీ సమస్యను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు ప్రజా పాలన అంటూ ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ గద్దెనెక్కాక ప్రజల సమస్యలను పట్టించుకోవటంలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజు, నర్సింహ, అరవింద్, మున్నీర్, రవి, స్వామి, సాగర్ రాజు, పాషా, వాజిద్, అబ్దుల్లా, వర లక్షి ్మ, అస్మ, విఫాష పాష, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా సర్జికల్ హెల్త్‌క్యాంప్ ప్రారంభోత్సవం

**నాంపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ సోమాజిగూడలోని సంస్కృతి రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ ఫ్రీ మెగా సర్జికల్ కరెక్షన్ అండ్ హెల్త్ క్యాంప్‌ను ఈరోజు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. హైదరాబాద్ కలెక్టర్ హరిచందన అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రిన్సిపల్ సెక్రటరీ దానాకిషోర్ తదితరులు పాల్గొనున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో డిసేబుల్ ట్రస్ట్, అగర్వాల్ సేవాదళ్ పిట్టి ట్రస్ట్, డాక్టర్ నారి చారిటబుల్ ట్రస్ట్, రవిహీలియోస్ హాస్పిటల్, వికలాంగుల నెట్‌వర్క్, వికలాంగుల హక్కుల సాధన సమితి, ఎఫ్ఇడి, జనజాగృతి ట్రస్ట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ భీమ్‌రెడ్డి, డిజెబుల్ ట్రస్ట్ సీఈఓ డా. బి.విజయభాస్కర్, డా. కీర్తనయాదవ్, నల్గొండ శ్రీనివాస్, కిరణ్ గుత్తికొండ తదితరులు సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించి తెలిపారు. ఈ శిబిరంలో వికలాంగులకు ఉచిత శస్త్రచికిత్సలు; జనరల్ హెల్త్‌చెకప్; దయాగ్నోస్టిక్ టెస్టులు; కంటి పరీక్షలు- ఉచిత కళ్లజోడు పంపిణీ; క్యాలిపర్స్, వీల్‌ఛైర్స్, ఎలక్ట్రిక్ మోటార్ వాహనాల పంపిణీ ఉంటాయని వారు వివరించారు. వికలాంగులు ఈ ఉచిత వైద్యసేవలు, సహాయక పరికరాలు అందుకోవాలని కోరారు.

## ఆర్ఎంపి, పిఎంపి లను ప్రభుత్వాలు గుర్తించాలి

**-మాజీ ఎమ్మెల్సీ టిడి.జనార్దన్**

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఆర్ఎంపి, పిఎంపీలకు జీఓ నెంబర్ 1278 కింద ఉమ్మడి రాష్ట్రంలో కమ్యూనిటీ పారామెడిక్స్ పూర్తి శిక్షణ పొందిన వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను ఇవ్వాలని పలువులు వక్తలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మురికివాడల్లో ఆర్.ఎం.పీ, పిఎంపీలు ప్రజల్లో ఎంతో విలువైన వైద్య సేవలదిస్తున్నారని వారు పేర్కొన్నారు. మన హెల్త్ ఇండియా, విజ్ఞానదర్శిని సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతా మురికివాడల్లో వైద్య సేవలపై ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మన హెల్త్ ఇండియా అధినేత, ప్రముఖ పాత్రికేయులు రాజేందర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి ఆర్ఎంపీ. పిఎంపీల సంఘాల ప్రతినిధి హాజరుకాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ ఎమ్మెల్సీ టిడి.జనార్ధన్, ప్రొఫెసర్ కోదండరాం, విజ్ఞాన దర్శన అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీ లను ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. అనేక రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపిలు ఎంతో విలువైన సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎంపీ, పీఎంపీలపై టిజిఎంసి దాడులను నిలిపివేసి వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, శిక్షణ మధ్యలో నిలిచిపోయిన వారికి ఆరు మాసాల శిక్షణ పూర్తి చేసి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ గోవింద్ రావు, గుజరాత్ రాష్ట్ర ప్రతినిధి సీఎర్రావు, బిహార్ రాష్ట్ర ప్రతినిధి హె.పీ సింగ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలకు తావివ్వద్దు

### మండపాలకు నాణ్యమైన వైరింగ్ వాడండి: ఎసిపి గోపాలకృష్ణమూర్తి

**బేగంపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త :** గణేష్ విగ్రహాల ఏర్పాటుతో పాటు మండపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అని బేగంపేట ఎసిపి గోపాల కృష్ణమూర్తి స్పష్టం చేశారు. ఆదివారం బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని ఫంక్షన్ విల్లాలో గణేష్ నిర్వహించిన నిర్వహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండపానికీ అనుమతులు తప్పనిసరి అన్నారు. విద్యుత్ కేబుల్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. తెగిపోయిన వైర్లకు జాయింట్లు వేయకూడదన్నారు. నాణ్యతలేనివి వాడితే షాక్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. బస్తీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, మండపాల వద్ద నిరంతరం నిఘా ఉండాలని సూచించారు. అనుమానిత వస్తువులు, అనుమానిత వ్యక్తుల సంచారాన్ని వెంటనే పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలన్నారు. బేగంపేట ఇన్స్‌పెక్టర్ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహిచిన ఈ సమావేశంలో ట్రాఫిక్ ఎసిపి ఇన్స్‌పెక్టర్లు, 250మంది గణేష్ నిర్వహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎసిపి గోపాలకృష్ణమూర్తి

**యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బేగంపేట ఎసిపి గోపాల కృష్ణమూర్తి అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపు నిచ్చారు. ఫిట్నెస్‌పైన దృష్టి సారించాలన్నారు. యోగా, ధ్యానం వంటి వాటిని యువత అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు శారీరక వ్యాయామం చేయాలన్నారు.

## ప్రశాంత వాతావరణలో వినాయక ఉత్సవాలు జరగాలి

**బేగంబజార్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలను భక్తులు ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. ఈమేరకు గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే 46 వార్షిక పూజకు ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్, కార్యదర్శి బుచ్చిరెడ్డి, అలె బాస్కర్, మహిల్‌పాల్‌రెడ్డిలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యనగరంలో నిర్వహించే సామూహిక గణేష్ ఉత్సవాలకు ఈనెల 27వ తేదిన జరిగే వినాయక చవితి పండుగకు ముఖ్యఅతిధిగా ఆహ్వానించినట్లు చెప్పారు.



జి.కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందచేస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులు

## సౌత్‌జోన్ హ్యాండ్ బాల్ క్రీడాకారులకు చేయూత

**అఫ్జల్‌గంజ్, ఆగస్టు17 ప్రభాతవార్త:** మహిళలు, విద్యుత్‌తో పాటు క్రీడాకారులుగా రాణిస్తూ దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకోవాలి రావాల్సిన అసవరం ఎంతైనా ఉందని న్యూకీన్లయర్ మెడిసిన్ టెక్నాలజీస్ట్, ఇండియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వగ్గు కుమారస్వామి కురుమ పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి 27 వరకు తమిళనాడులో జరిగే సౌత్‌జోన్ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటిలో పాల్గొనే క్రీడాకారులకు, టిషర్టులు, ప్రయాణి చార్జీలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఎంతో ఒత్తిడి కలిగి ఉన్నప్పటికి, ఆత్మస్థైర్యంతో క్రీడల్లో రాణించాలన్నారు. ఈ దిశగా హ్యాండ్ బాల్ క్రీడాకారులు, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ క్రీడా కోచ్ రమాకాంత్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కోచ్ రమాకాంత్

## లక్ష్య సాధనలో జయాపజయాలను పట్టించుకోవద్దు

**గన్‌ఫౌండ్రి, ఆగస్టు 17ప్రభాతవార్త:** అబిడ్స్ ఇస్కాన్ మందిరంలో రెండవ రోజు ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి ముగింపు వేడుకలను అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వరద కృష్ణదాస్ మాట్లాడుతూ ఆరు నూరైనా, నూరు అరైనా సంకల్పించిన కార్యం చేసితీరితేనే నిష్ఠ ఏర్పడుతుందన్నారు. లక్ష్య సాధనలో జయాపజయాలను పట్టించుకోకుండా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శంబు దాస్‌లతోపాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షులు వరద కృష్ణదాస్

## ఓడినా స్థానిక సమస్యలపై పోరాడుతున్నా

**గోషామహల్, ఆగస్టు17 ప్రభాతవార్త:** మాజీ మంత్రి,బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్లకుంట్ల తారక రామారావును గోషామహల్ నియోజక వర్గం బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ నందినగర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చేస్తున్న కృషి గురించి కెటిఆర్‌కు వివరించారు. కార్పొరేటర్‌గా ఓటమి చెందినప్పటికి నిరాశ చెందకుండా నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ఎప్పటికప్పుడు స్థానిక సమస్యలను తెలుసుకుని ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం దిశగా కృషి చేయాల్సిన అవసరం భాధ్యత ఎంతైనా ఉందన్నారు.

## బిసి సమాజాన్ని మరింతగా ఐక్యం చేయాలి

**నిజాంపేట్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిసి కోర్ కమిటీ ముఖ్య నాయకుల 7వ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షులు లింగాల గంగాధర్, సీనియర్ నాయకులూ సాయి రాజ్, శ్రీనివాస్ గౌడ్, కుమార్ యాదవ్ (సూపర్), నర్సింహా యాదవ్, దుర్గా ప్రసాద్, బొండాడ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బిసిల గురించి మాట్లాడవలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పండిందని, ఇది రాష్ట్రంలో ఉన్న రెండు కోట్ల ఇరువై లక్షల మంది బిసిలు సాధించిన మొదటి విజయమని అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీసీ సమాజాన్ని ఐక్యం చెయ్యటంలో మరింత బలంగా ముందుకు వెళ్లాలని కమిటీ సభ్యులందరు నిర్ణయించటం జరిగింది. ఈ సమావేశం తీసుకొన్న ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను అన్ని డివిజన్లలో వేగవంతం చెయడం. సభ్యత్వంతో పాటు నాయకత్వ భాద్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్న వివిధ డివిజన్లకు చెందిన బీసీ సభ్యులకు తదుపరి సమావేశంలో భాద్యతలు, ప్రమాణ స్వీకారం. కాంగ్రెస్ పార్టీలో ఎంఎస్సి పరిధిలో పక్క ప్రణాళిక ప్రకారం జరుగుతున్న కొన్ని సంఘటనలకు సంభందించి హనుమంత్‌రెడ్డితో చర్చించి తదుపరి కార్యాచరణ సిద్ధం చెయ్యటం గురించి నిర్ణయాలు తీసుకున్నారు.

## తెలంగాణ బహుజన ధీరత్వానికి ప్రతీక పాపన్న గౌడ్

**జీడిమెట్ల, ఆగస్టు 17, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్, దేవేందర్ నగర్ నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిధిగా పాల్గొని పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం దేవేందర్ నగర్ నూతన గౌడ సంఘం సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, దొరల అరాచకాలను, మొగులాయి దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడని కొనియాడారు. రాజకీయ, సామాజిక సమానత్వం, కుల, మతాల వివక్ష లేకుండా సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పోరాడిన యోధుడు పాపన్న గౌడ్ అని అన్నారు. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక పాపన్న గౌడ్ మహారాజ్ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ముద్దాపురం మాధన్ గౌడ్, దేవేందర్ నగర్ నూతన గౌడ సంఘం అధ్యక్షులు పటేల్ గారి గోపాల్ గౌడ్, ఉపాధ్యక్షులు వెండి రవి, ప్రధాన కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్ గౌడ్, కోశాధికారి రవి కుమార్ గౌడ్, సంయుక్త కార్యదర్శి సత్య ప్రకాశ్ గౌడ్, కార్యనిర్వాహణ అధికారి మైసగోని బాలరాజ్ గౌడ్, ఆల్వాల్ ఉపేందర్ గౌడ్, సభ్యులు రమేష్ బాబు గౌడ్, శివరాజ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పించిన కూన శ్రీశైలం గౌడ్



పాల్గొన్న ప్రేమ కుమార్ దంపతులు

## సందడిగా హ్యాండ్లూమ్ శారీ వాక్

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 17, ప్రభాతవార్త :** హలో హైదరాబాద్ స్పోర్ట్స్, ఈవెంట్స్ కమిటి లక్షీ ్మ ఆధ్వర్యంలో 3కె హ్యాండ్లూమ్ శారీ వాక్ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కూకట్పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ప్రేమ కుమార్ దంపతులు పాల్గొన్నారు. కూకట్‌పల్లిలోని జెఎన్‌టియు వద్ద ప్రారంభమై ఫోరం మాల్ వరకు ఘనంగా హ్యాండ్లూమ్ శారీ వాక్ నిర్వహించారు. మన దేశ హస్తకళల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రేమ కుమార్ పాల్గొని హస్తకళాకారుల కష్టాలు గుర్తించి వారిని ఆదరించాల్సిన అవసరాన్ని వివరించారు. చేనేత వస్త్రాలు మన సంప్రదాయం, సంస్కృతి, గౌరవానికి ప్రతీకలు. ప్రతి ఒక్కరూ హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ప్రోత్సహిస్తేనే స్థానిక కార్మికులకు ఉపాధి లభిస్తుందనీ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అందరూ సంప్రదాయ శారీలతో నడిచి చేనేత వస్త్రాల అందాన్ని ప్రదర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింతగా జరగాలని ప్రేమ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజయ్‌గుప్తా, రవితేజరెడ్డి, సంజయ్‌రెడ్డి, గోపాల్ తదితర సభ్యులు

## ఘనంగా గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్

**నాంపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త :** మహాత్మగాంధీ ఆశయాలు, గాంధేయవాదాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల స్వర్ణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడాదిపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలలో వివిధచోట్ల మహాత్మగాంధీ విగ్రహాల ప్రదర్శన, గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సులు, స్వదేశీమేళా వంటి పలు సమాజ జాగృత, సామాజిక స్పృహ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈ సంస్థల అధ్యక్షుడు జి.రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. ఈమేరకు సంస్థల కార్యాలయంలో వారు ఇతర సభ్యులతో కలిసి సంబంధిత గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ స్వర్ణోత్సవాల్లో భాగంగా అక్టోబరు 10నుండి 13వరకు నాలుగురోజులపాటు హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియం వేదికగా మహాత్మగాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సులు, స్వదేశీమేళ తలపెట్టినట్లు, నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో లక్ష మహాత్మగాంధీ విగ్రహాలను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటింటా గాంధీ ప్రతిమలు, ప్రతీ హృదయం శాంతి తదితర బృహత్తర కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్వదేశీమేళాలో సేంద్రియ సాగుపద్ధతులు, కుటీర గ్రామీణ పరిశ్రమలు, కులవృత్తుల చేయూత వంటి గాంధీజీ తదితర ఆశయాలపట్ల ప్రజల్లో అవగాహన పెంచేదిశగా ప్రయత్నిస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు ప్రభాకర్, సంజయ్‌గుప్తా, సంజయ్‌రెడ్డి, రవితేజరెడ్డి, రాజకుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పదలాలిత్య భావసౌందర్యం లలితసంగీతం

**ఖజానా శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర**

**నాంపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త :** ఎంతో శ్రావ్యం సుమధురమైన లలితసంగీతానికి పదలాలిత్యం, భావ సౌందర్యం ఆభరణాలవంటివని తెలంగాణ రాష్ట్ర ఖజానా లెక్కలశాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర అన్నారు. నవ్యనాటకసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని డా. రావిచెట్టురంగారావు కళావేదికలో సమితి నిర్వహించిన 26వ లలితసంగీత పోటీలను ముఖ్యఅతిథిగా ఆమె గౌరవ అతిథులు బి.వినోద్‌బాబు, డా. నందూరి విద్యారణ్యస్వామి, వేమరాజు విజయకుమార్, సుధారాణి, నిష్టల సుధామాల, సత్యవాణి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి లాంఛనంగా ప్రారంభించారు. దేవుపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, బాలాంత్రపు రజనీకాంతరావు, పాలగుమ్మి విశ్వనాథం, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, మంచాల జగన్నాథరావు తదితరులు తమ రచనలతో లలితసంగీతాన్ని సుసంపన్నం చేశారని గుర్తుచేశారు. సంస్థ అధ్యక్షుడు విజయకుమార్ సభకు స్వాగతం పలుకగా వినోద్‌బాబు నాటకసమితి ప్రతీసంవత్సరం ఈ పోటీలను నిర్వహిస్తూ అనేకమంది యువకళాకారులను ప్రోత్సహించడం శ్లాఘనీయమని అన్నారు. ఈ పోటీల్లో సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో 60మందికిపైగా కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం విశేషం.

## తెలంగాణలో టిడిపిని పునర్నిర్మించాలి

**నిజాంపేట్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నాగేష్ ముదిరాజ్ కలిసారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కలిసి పలు విషయాలమీద చర్చించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పటిష్టత మీద, తెలంగాణకు నూతన అధ్యక్షుడుని నియమించటంతో పాటు పార్టీని తెలంగాణాలో పునర్నిర్మించాలని ముఖ్య మంత్రిని కోరారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అన్ని పదవులు భర్తీ చేయాలని నగేష్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. త్వరలో మీరు శుభవార్త వింటారు అని బాబు హామీ ఇచ్చినట్లు నాగేష్ ముదిరాజ్ తెలిపారు. 25 సంవత్సరాలుగా తెలుదేశం పార్టీ కార్యకర్తగా నాయకుడుగా పార్టీ ప్రతిష్ఠకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న నేత అని నాగేష్ ముదిరాజ్‌ను చంద్రబాబు నాయుడు అభినందించినట్లు నాగేష్ తెలిపాడు.



ఏపి సిఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్ ముదిరాజ్

హెడ్డింగ్:రహదారి వెడల్పు పనులు చేపట్టాలి.

ఫోటోరైటప్:ఎర్రగడ్డ జాతీయ రహదారి నుంచి జనప్రియ అపార్టుమెంటు వరకు రోడ్డు వెడల్పు పనుల కోసం వివరాలను అడిగి తెలుసుకుంటున్న తెలంగాణ పాడి అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గుత్తా అమిత్‌రెడ్డి, చైర్మన్ వెంకటరామ్‌రెడ్డి.

ఫైల్‌నేమ్,ఏఎమ్‌పిపి 2

యూసుఫ్‌గూడ, ఆగస్టు 17, ప్రభాతవార్త : ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న ఎర్రగడ్డ ప్రధాన రహదారి నుంచి జనప్రియ అపార్టుమెంట్ల వరకు రహదారి వెడల్పు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాలు ఇదే రహదారి గుండా మోతీనగర్ మీదుగా హైటెక్‌సిటీకి వెళ్తుంటారు. ఈ రహదారి వెడల్పు పనులు చేపట్టాలంటూ పలుమార్లు వివిధ రాజకీయ నాయకులకు అధికారులకు విన్నవించుకున్నప్పటికి పనులు జరగలేదు. అయితే కాంగ్రెస్ పార్టీ

## ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలి

**సైఫాబాద్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలని ఐఎల్‌డబ్ల్యూఎఫ్ ఛైర్మన్ మీర్ ఇన్నాయత్ ఆలి బక్రి, అధ్యక్షుడు అక్రమ్‌ఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇతర జిల్లాల్లోని ఆటోలను నగరంలోకి ప్రవేశించకుండా ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో 2 లక్షల ఆటోలు ఉంటే ఇతర జిల్లాల నుంచి వచ్చిన 3 లక్షల ఆటోల వల్లనే ట్రాఫిక్ రద్ది పెరిగిపోతున్నదని, అంతేకాకుండా ఇక్కడ ఆటో డ్రైవర్లకు గిరాకిలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో మీటర్‌కు చార్జీలు పెంచాలని, ప్రతి ఏడాది ఆటో డ్రైవర్‌కు 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, ఆటో డ్రైవర్లపైన పోలీసులు, ఆర్టీఓ అధికారుల దాడులను అపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో నాయకులు షేక్ మాజీద్, రాందాస్, షేక్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల వేలం

**బేగంపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం ఉదయం గం 11లకు ద్విచక్రవాహనాల వేలం వేయనున్నట్లు సికింద్రాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ జగన్మోహన్‌రెడ్డి తెలియజేసారు.వివిధ కేసులలో పట్టుబడిన 9 ద్విచక్రవాహనాలను వేలం వేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పంచాక్షరి సమక్షంలో ఎక్కడ ఎలా ఉన్న వాహనం అక్కడ అలానే విధానంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఎవరైనా వేలంలో పాల్గొనాలంటే వారి ఆధార్ కార్డు కాపీ,పాన్‌కార్డు కాపీ తో పాటు రూ 25000లు నగదు లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ముందుగా జమచేసి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వేలం పాటలో వాహనం పొందని వారికి ఇది తిరిగి ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాలకోసం 8712659644నెంబర్‌ను సంప్రదించాలని ఇన్స్‌పెక్టర్ తెలియజేసారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

## రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం

**కంటోన్మెంట్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** బోయిన్ పల్లి వార్డు 6 అరవెల్లి ఎన్‌క్లేవ్, రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీలలో 39 లక్షల రూపాయలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఓపెన్ నాలా పనుల ప్రారంభోత్సవంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌తో పాటు కలిసి పాల్గొన్నారు. పనుల ప్రారంభోత్సవం అనంతరం కాలనీల వాసులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితమని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా సమకూరుతున్న 303 కోట్ల రూపాయలతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో గతంలో కనీవినీ అభివృద్ధి జరుగబోతుందని, అందరం సమన్వయం చేసుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ బూత్‌కమిటి సమావేశంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్

## పార్టీ గెలుపునకు కృషి చేయాలి

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 17, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి సమన్వయంతో పనిచేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్‌లు అన్నారు. ఆదివారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎఫ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో డివిజన్ కాంటెస్టెడ్ కార్పోరేటర్ బండపల్లి భవాని శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ స్థాయి కమిటి సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ప్రజా పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అర్హులైన ప్రతి పేదవాడికి పథకాలు దరిచేరుకున్నాయన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ అనుకోని పరిస్థితుల్లో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికలు వచ్చాయని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకునేందుకు వర్గ విబేధాలను పక్కన పెట్టి క్రమశిక్ష గల కార్యకర్తలుగా పార్టీ గెలుపు కోసం కృషిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎన్నికల కంటే ముందే పరిష్కరించి చూపిస్తామన్నారు. ప్రజా పాలనకు ప్రజల ఆశీర్వాదం ఎపుడు ఉండాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మహ్మద్ హజారుద్దీన్ కాంటెస్టెడ్ కార్పోరేటర్ భవాని శంకర్, ఎమ్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి డివిజన్ కార్పోరేటర్ సిఎన్ రెడ్డి, కిరణ్‌యాదవ్, నాగరాజు, జాఫర్‌హుస్సేన్, బెన్‌హర్, శివ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలో హెచ్ఎఫ్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్, పోలీసుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రెండు వర్గాలు తోపులాట జరిగింది. కాంటెస్టెడ్ కార్పోరేటర్ వర్గానికి ప్రస్తుత కార్పోరేటర్ వర్గానికి మధ్య తోపులాట జరగడంతో ఒకరిపై ఒకరు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేసుకున్నారు. మంత్రి సమక్షంలోనే ఉప ఎన్నికలకు ముందే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వర్గ విభేదాలు బయట పడ్డాయి. దీనితో అక్కడి కార్యకర్తలు బూతు స్థాయి నాయకులు అశ్చర్యం వ్యక్తం చేశారు.

## అన్ని రంగాల అభివృద్ధి రేవంత్ రెడ్డితోనే సాధ్యం

**జీడిమెట్ల, ఆగస్టు 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి సిఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శ్రీ చిత్తరమ్మ దేవస్థానం వద్దకు నియోజకవర్గం నుండి వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజలతో కలిసి వాళ్ళ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు, ప్రజల నుండి వచ్చిన ఆహ్వానాలు, వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందిం చారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ప్రజా సంక్షేమంలో, సాంకేతిక రంగంలో, పరిశ్రామిక రంగంలో, విద్య, ఉపాధి రంగాలు అభివృద్ధి చెందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమా పథకాలను అందరు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమానికి ఈ ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

## వీరభద్రస్వామిని దర్శించుకున్న భక్తులు

**గుమ్మడిదల ఆగస్టు 17 ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం(బొంతపల్లి) వార్డులో కొలువై ఉన్న వీరభద్రస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ ఆదివారం కావడం వల్ల భక్తులు వేల సంఖ్యలో వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అలాగే భక్తులందరికీ అన్న ప్రసాదం వితరణ చేయడం జరిగింది. దేవస్థాన చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్, దేవస్థాన పర్యవేక్షకులు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలవకుండా ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే పాలకమండలి దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. స్వామివారి దర్శనానికి 6 గంటల సమయం పట్టింది. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కలను తీర్చుకున్నారు.

## చీకూర్తిని సందర్శించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

### -రైతులతో కలిసి పంటలను, వాగుల పరిశీలన



చీకూర్తిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**న్యాల్‌కల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు, రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆదివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మండలపరిధిలోని చీకూర్తి గ్రామాన్ని సందర్శించి రైతులు, బిఆర్ఎస్ నాయకులతో కలిసి నీట మునిగిన పంటలను, పొంగుతున్న వాగులు, వంకలను పరిశీలించారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను, పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మున్నూర్ రవీందర్, వెంకటేశం, మాజీ మండల అధ్యక్షులు ఎల్‌చల్ నర్సింహారెడ్డి, నాయకులు, మాజీ సర్పంచ్‌లు, రైతులు ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, భూమారెడ్డి, ఉమేష్, మహన్‌రెడ్డి, కిష్టరెడ్డి, అశోక్‌పాటిల్, నజీర్‌ఖాన్, యశీన్ పాల్గొన్నారు.

## 24 జోగిపేటకు మందకృష్ణ రాక



మాట్లాడుతున్న నాయకులు

**అల్లాదుర్గం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఈ నెల 24న జోగిపేటలో పెన్షన్ పెంపుపై నిర్వహిస్తున్న సభకు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు సమన్వయ కమిటీ సభ్యులు, జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, మాజీ జడ్పీటిసి సభ్యులు అర్జునయ్య తెలిపారు. ఆదివారం అల్లాదుర్గంలో వారు మాట్లాడుతూ సెప్టెంబరు 9న హైదరాబాద్‌లోని పెరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగసభకు సన్నాహకంగా అందోల్ నియోజకవర్గంలో ఈ నెల 24న సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన హామీల మేరకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్‌లు పెంచాల్సి ఉండగా అధికారంలోకి వచ్చి రెండేళ్ల కావస్తున్నా హామీలను అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పెన్షన్‌లు పెంచేలా ప్రభుత్వంతో తేల్చుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏర్పుల కృష్ణ, సంటినోళ్ల సంజీవయ్య, కాకతీయ యూనివర్సిటీ నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు, మాజీ కౌన్సిలర్ సంతోష్, మాజీ ఎంపిటిసి సభ్యులు లింగయ్య, ప్రశాంత్, నాయకులు నక్క సూర్యకుమార్, జలగల రవి, జలగల అశోక్, నడిపోల్ల శివ, యాదయ్య, మాణిక్యం, ఇటిక్యాల క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య యూత్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ఆర్యవైశ్య యూత్ కమిటీ సభ్యులు

**పెద్దశంకరంపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త :** పెద్దశంకరంపేటలో ఆర్యవైశ్య సంఘం భవనంలో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం యూత్ కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గడ్డం మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా కైల సంగమేశ్వర్, కోశాధికారిగా బొడ్ల ఆనంద్ కుమార్లతో పాటు ఉపాధ్యక్షులుగా దాదిగారి సురేష్, పబ్బ మణికిరన్, కార్యదర్శులుగా కందుకూరి శ్రీకాంత్, ప్రమోద్, సహాయ కోశాధికారులుగా బిల్లకంటి వంశీ, కందుకూరి అయ్యప్ప. పీఆర్వోలుగా దాదిగారి వినీత్, పురం కిశోర్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నేడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

**నర్సాపూర్ ఆగస్టు 17, ప్రభాతవార్త:** నేడు(సోమవారం) నర్సాపూర్ పట్టణంలో అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడానికి చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు, బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నర్సాపూర్ పట్టణంలోని నర్సాపూర్ సంగారెడ్డి రోడ్డులో గల ఆయన విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జయంతి వేడుకల కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా గౌడ నాయకులు, కుల సంఘాల పెద్దలు ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ కోరారు.

## జెసి ఆధ్వర్యంలో నేడు బైక్ ర్యాలీ

**చేర్యాల, ఆగస్టు 17,ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ నేడు(సోమవారం) చేర్యాలలో బైక్ ర్యాలీ నిర్వహించబోతున్నట్లు జేఏసి చైర్మన్ వకుళభరణం నర్సయ్య పంతులు తెలిపారు. అందుకు వాణిజ్య,వ్యాపార,కుల సంఘాలతో పాటు నాలుగు మండలాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరవు

### శిథిలావస్థలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు... నిరుపయోగంగా కొన్ని భవనాలు.. ఇబ్బందుల్లో అధికారులు, ఉద్యోగులు

**నర్సాపూర్ ఆగస్టు 17, ప్రభాతవార్త:** పట్టణంలో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అధికారులు, సిబ్బంది, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్‌లో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా అధికారులు భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు అదేవిధంగా మరికొన్ని భవనాలను నూతనంగా నిర్మించినా నిరుపయోగంగా ఉండగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నర్సాపూర్ డివిజన్ కేంద్రంగా ఏర్పడగా రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి పక్కా భవనం లేక పశుసంవర్ధక శాఖ భవనంలో కొనసాగిస్తున్నారు. ఈ భవనం సరిపోకపోవడంతో గత ఎన్నికల సమయంలో అధికారులు గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దస్తావేజులు రికార్డులు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి చోటుచేసుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్, త్రిబుల్ ఆర్ రోడ్డునిర్మాణాలకు భూసేకరణ నిమిత్తం ప్రజలు ఈ కార్యాలయానికి అనేక అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అంతేగాక నర్సాపూర్ పట్టణంలో ఎక్సైజ్ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోగా నూతన ఎక్సైజ్ శాఖ భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరైనా వివిధ కారణాలవల్ల నిలిచిపోగా అద్దె భవనం దొరకక నీటి పారుదల శాఖ అతిథి గృహం(ఐ బి)లో కొనసాగిస్తున్నారు. ఈ భవనంలో చిన్నగదులు ఉండడంతో ఒకగది ఎక్సైజ్ సీఐకి కేటాయించగా మరొక గది ఎక్సైజ్ ఎస్‌ఐలకు సిబ్బందికి కేటాయించారు. దీంతో ఈ శాఖలకు సంబంధించిన రికార్డులు దస్తావేజులు ఉంచడానికి అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా మండల రెవెన్యూ కార్యాలయం సైతం నీటిపారుదల శాఖ అతిథిగృహంలోనే నిర్వహిస్తున్నారు. పాత మండల రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోగా పూర్తిగా తొలగించారు. దీంతో నూతనంగా మండల రెవెన్యూ కార్యాలయం భవన నిర్మాణానికి రూ. 70 లక్షల మంజూరయ్యాయి. ఈనిధులతో భవన నిర్మాణం పనులు ప్రారంభమై పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది. అయితే పాత కార్యాలయ భవన స్థలంలో సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి మున్సిపల్ శాఖ నిర్వహించింది. ఈ మార్కెట్ భవన నిర్మాణం నాలుగు కోట్లతో నిర్మించనుండగా అసంపూర్తిగా మిగిలిపోయింది. అంతేగాక జూనియర్ సివిల్‌కోర్టు భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో ఈ కోర్టును ఐసిడిఎస్ భవనంలో నిర్వహిస్తున్నారు. జూనియర్ సివిల్ కోర్టు భవనంతో పాటు డిఎల్‌పిఓ, వ్యవసాయ శాఖ, సహాయ కార్మికశాఖ తదితర కార్యాలయాలకు పక్క భవనాలు లేక అధికారులతో పాటు సిబ్బంది ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. నీటిపారుదల శాఖ అతిథి గృహం గుట్ట పైన ఉండగా ఈ అతిథి గృహంలో ఎక్సైజ్ శాఖ, మండల రెవెన్యూ శాఖల కార్యాలయాలు నిర్వహిస్తుండటంతో ప్రజలు గుట్ట పైన ఉండడంతో అనేక అవస్థలు పడుతు గుట్ట పైకి వెళుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు స్పందించి డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్క భవనాల నిర్మాణాలను చేపట్టి అధికారులకు ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు




నీటిపారుదల శాఖ అతిథి గృహంలో నిర్వహిస్తున్న మండల రెవెన్యూ కార్యాలయం దృశ్యం

## సెల్‌టవర్ ఏర్పాటు విరమించుకోవాలి

### కెఎస్ఆర్ కాలనీలో కాలనీ కాలనీవాసుల నిరసన

**అమీన్‌పూర్, ఆగస్టు 17 ప్రభాతవార్త :** జనవాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు ను వెంటనే విరమించుకోవాలని కెఎస్ఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్ కాలనీవాసులతో కలిసి డిమాండ్ చేశారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కెఎస్ఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయబోయే సెల్ టవర్ ఏర్పాటుకు నిరసనగా కాలనీవాసులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కాలనీల మధ్య టవర్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతింటాయని, నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు సెల్ టవర్ ఏర్పాటు ను వెంటనే ఆపాలని కోరుతూ కాలనీవాసులు అమీన్పూర్ మున్సిపల్ కమిషనర్ మరియు అమీన్పూర్ పోలీస్ స్టేషన్ లో సైతం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. టవర్ ఏర్పాటు వల్ల దాన్ని నుంచి వెలువడే రేడియేషన్ కు పక్షి పక్షాదులే కనుమరుగైన దాఖలాలు ఉన్నాయని, అట్లాంటిది జనవాసాల మధ్య టవర్ ఏర్పాటుతో కాలనీతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులతో పాటు అనారోగ్యాల పాలవుతారని వాపోయారు. సెల్ టవర్ ఏర్పాటు విరమించుకోకపోతే కోర్టుకు సైతం వెళ్లడానికి వెనకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లికార్జునరావు, ఏ శ్రీనివాసరావు, ఆదిత్య, రూపక్ బదియా, కాలనీవాసులు గణేష్, నరసింహ, రాజకుమార్, శివ మోహన్ రెడ్డి, లలిత,పార్వతి,రమ,కళ్యాణి,ఉమా రజియా, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేసిన ఎమ్మెల్యే

**ఝరాసంగం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 8 మంది లబ్దిదారులకు ఆదివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు 3.51లక్షల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందచేశారు. వనంపల్లి గ్రామానికి చెందిన కిందొడ్డి కమలమ్మకు 24వేలు, చిల్కేపల్లికి చెందిన వడ్డేపల్లి నగేష్‌కు 51 వేలు, ఏడాకులపల్లికి చెందిన నడిమిదొడ్డి సూర్య ప్రకాష్‌కు 54వేలు, మాచ్నూర్‌కు చెందిన తహేరాబేగంకు 39 వేలు,ఏల్గోయికి చెందిన సమీనా బేగంకు 51వేలు, బుజ్జమ్మకు 42వేల, కంబాలపల్లికి చెందిన తాటిపల్లి విట్టబాయికి 30వేలు, నీలమ్మకు 60వేల చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో ఝరాసంగం, కోహీర్ మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేశం, నర్సింలు, ఏడాకులపల్లి మాజీ సర్పంచ్ మాణిక్‌ప్రభు పాటిల్, చిల్కేపల్లి మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణరెడ్డి, కిజర్, బాబు మియా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మధ్య నిలిచేవారు శతక కవులు : ఎమ్మెల్సీ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రజల మధ్య నిలిచి, ప్రజల కోసం పాటుబడేవారు శతక కవులని, రచయిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో యువకవి నల్ల అశోక్ రచించిన సుకృతి శతకం పుస్తకాన్ని ఆవిష్కరణ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ వృత్తి ఉపాధ్యాయులైన ప్రవృత్తిగా రచనలు చేస్తున్న నల్ల అశోక్‌కు అభినందనలు తెలిపారు. సమాజ శ్రేయస్సుకు సాహిత్యం అవసరమని నాగరికత సారాన్ని తత్వంగా, కవిత్వంగా అందించే సృజనకారులు కవి, రచయితలు ముందు నిలుస్తారన్నారు. కార్యక్రమంలో ఆడెపు కరుణాకర్, అంకిల్ల వెంకటేశ్వర్ రెడ్డి, బండకాడి అంజయ్యగౌడ్, కంది శంకరయ్య, ఎన్నవెళ్లి రాజమౌళి, అలాజీపూర్ శ్రీనివాస్, ఉంద్రాళ్ల రాజేశం, నరసింహారావు, మంచినీళ్ల సరస్వతి, రామశర్మ, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, దుర్గం శ్రీనివాస్, నల్ల వెంకటేశం, గుండ్ల రాజు,



సుకృతి శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్,కవులు



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిఆర్‌టియు నాయకులు

## 1న హైదరాబాద్‌లో మహాధర్నా

### -వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన పిఆర్‌టియు నాయకులు

**జహీరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సిపిఎస్ రద్దు కోరుతూ పిఆర్‌టియు ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను ఆదివారం పిఆర్‌టియు జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ తులసి రామ్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తులసిరామ్ రాథోడ్ మాట్లాడుతూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి జహీరాబాద్ డివిజన్ నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు డి శ్రీనివాస్, వరాలు, బాలయ్య, విఠల్, అమర్‌నాథ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, స్వామి దాస్, శ్రీశైలం, బాగయ్య, అర్జున్‌చౌహాన్, మురళీధర్, తిరుమలేష్, యాదవులు, తుకారాం చౌహాన్, యం అశోక్, ఆనంద్, చిట్టి బాబు, శంకర్, సంగయ్య, బోయ వెంకటేశం, శేఖయ్య, జైసింగ్ చౌహాన్, గోవర్ధన్, హన్మంత్ పవార్, దళ్‌సింగ్ రాథోడ్, జితేందర్, ప్రభు, శివశేఖర్, వీరేశం, శ్రీనివాస్, విజయ్ కుమార్, రమేష్ పవార్, సుధాకర్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు వీడియోలను సృష్టించారు

### మున్సిపల్ మేనేజర్ జె.ప్రభాకర్

**చేర్యాల, ఆగస్టు 17,ప్రభాతవార్త :**

కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు తమ వీడియోలకు (బ్యాగ్‌గ్రౌండ్) సాంగ్స్ మార్ఫింగ్ చేసి మీడియా, సోషల్ మీడియాకు తెలిపారని చేర్యాల మున్సిపల్ మేనేజర్ జె.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల పంద్రాగస్టు రోజు జెండా వేడుకల అనంతరం ఖాళీ సమయంలో కొంత మంది అధికారులు, సిబ్బంది సినిమా పాటలు పెట్టుకుని డ్యాన్సులు చేశారని మీడియా, సోషల్ మీడియాలో ప్రచురితం అయ్యింది. ఆదివారం ఈ విషయంపై మున్సిపల్ మేనేజర్ స్పందించి మాట్లాడుతూ తమంటే పడని వ్యక్తులు కొంత మంది తప్పుడు వీడియోలను సృష్టించి మీడియాకు, సోషల్ మీడియాకు పంపారని తామందరం దేశభక్తి పాటలతో డ్యాన్సులు వేశామే తప్పా ఎలాంటి తప్పిదం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## రేపు బోధన అభ్యాసన పరికరాల ప్రదర్శన

**మర్కుక్, ఆగస్టు 17 (ప్రభాతవార్త):** ఈనెల 19వ తేదీ మంగళవారం మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులచే బోధన అభ్యసన పరికరాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటరాములు తెలిపారు. ప్రతి పాఠశాల నుండి తెలుగు, ఆంగ్లం సంబంధించిన మరియు బాషేతర గణితం, పరిసరాల విజ్ఞానంనుండి ఉండే విధంగా కనీసం రెండు, అత్యధికంగా మూడు అనుమతించడం జరుగుతుందన్నారు. ప్రతి బోధనోపకరణము స్పష్టమైన అభ్యసన సామర్థ్యము సాధించేదిగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు చేస్తూ, సంబంధిత సామర్థ్యంను సాధించేదిగా, ఉపాధ్యాయుడు తరగతి గదిలో సులభంగా ఉపయోగించేదిగా ఉండాలని, వీలైనంత వరకు ప్లాస్టిక్ వినియోగించకుండా తక్కువ ఖర్చుతో సృజన శీలంగా కొత్తగా ఉండాలన్నారు. బహుళ ప్రయోజకారిగా ఉంటే మరీ మంచిదన్నారు. మండలంలో ఎంపికైన ఉత్తమ మొదటి టిఎల్‌ఎంకు రూ.వెయ్యి, ద్వితీయ టిఎల్‌ఎంకు రూ.500 ప్రశంసాపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఉదయం 10 గంటల వరకు మర్కుక్ పాఠశాలకు చేరుకొని వారికి కేటాయించిన స్థలములో ప్రదర్శన చేయాలని తెలిపారు.

# నీట మునిగిన పంటలు-పరేషాన్‌లో రైతులు

**చౌటకూరు/పుల్‌కల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు సాగు చేసుకుంటున్న పత్తి, వరి పంటలు నీటమునిగాయి. అతి వృష్టితో కొంతవరకు పంటలు నష్టపోగా అధికారుల నిర్లక్ష్యం మూలంగా మరి కొన్ని పంటలు పాడైనట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలు ఆగకపోతే మరింతగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పుల్‌కల్ మండలం లాల్‌సింగ్‌నాయక్ తండా పరిధిలోని సింగూరు ప్రధాన కాలువలో సంబంధిత అధికారులు జంగిల్ కటింగ్ చేయించకపోవడంతో కాలువలో మొలకెత్తిన పిచ్చి మొక్కల, చెత్తా చెదారంతో నారింజ నుంచి సాగునీరు సాఫీగా ముందుకు సాగక రైతులు సాగు చేసుకుంటున్న పంట పొలాల్లోకి చేరి పంటలు పాడయ్యేలా చేశాయని రైతులు దుయ్యబడుతున్నారు. వర్షాకాలానికి ముందే అధికారులు జంగిల్ కటింగ్, కాలువల్లో పూడిక తీసే పనులు చేయాల్సి ఉండగా అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరించడంతో కాలువల గుండా సాగు నీరు ప్రవహించక, పంట పొలాల్లోకి చేరుకోవడంతో పంటలు నీట మునిగి రైతు కంట కన్నీరు పెట్టించాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన పొదలను తొలగించడంతో పాటు నీటపాలయిన పంటలకు నష్టపరిహారం అందించి, నీటిపాలైన పంటల దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



లాల్‌సింగ్ నాయక్ తండాలో నీట మునిగిన వరి పంట దృశ్యం

## గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి అవసరం

### ఎస్‌ఐ దోమ సుజిత్

**న్యాల్‌కల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసుకునే గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ దోమ సుజిత్ అన్నారు. గ్రామాల్లో ప్రతిష్టించే చిన్న, పెద్ద తేడా లేకుండా వినాయకుడిని ప్రతిష్టించుకుంటే విధిగా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. లంబోదరుడిని మండలం వివరాలను తాము పేర్కొన్న లింక్‌లో నమోదు చేసుకుని ఒక సెట్ జిరాక్సు పత్రాలను పోలీసు ఠాణాలో అందచేయాలన్నారు. ఏకదంతుడి మండపాల వివరాలు అందిస్తేనే ఉత్సవాలు పూర్తయ్యే వరకు పోలీసులు అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయని గుర్తు చేశారు. పార్వతీ తనయుడు విఘ్నేశ్వరుడిని ప్రతిష్టించుకునే నిర్వాహకులు తమ మండపాల వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్‌ఐ దోమ సుజిత మండల ప్రజలకు సూచించారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**మునిపల్లి, ఆగస్టు 17(ప్రభాతవార్త):** మునిపల్లి మండలం బుదేరాలో ఆదివారం శ్రీసాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. 147 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు, కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈ సంర్భంగా శ్రీసాయి సేవా సమితి ఆర్గనైజర్ డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడుతూ పల్లెలలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేదల కోసం శ్రీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో బిపి,షుగర్ కంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వడం జరిగిందన్నారు. కంటి బాధ ఎక్కువ ఉంటే ట్రస్ట్ ద్వారా ఆపరేషన్ చేయిస్తామన్నారు. ఎవరికైనా ఎక్కువ ఇబ్బందులు ఉంటే ట్రస్టు ద్వారా ఆపరేషనుకు అవసరమైన సహాయం అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాయిరాం శిబిరం సభ్యులు డాక్టర్ ఉపేందర్, కంటి డాక్టర్ ప్రకాష్ శెట్టి ,డాక్టర్ దివ్య, డాక్టర్ శ్రీకాంత్ ,డాక్టర్ సురేందర్ ,డాక్టర్ రమేష్‌లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో వీధి దీపాలు ఏర్పాటు

**కొల్చారం, ఆగస్టు 17(ప్రభాతవార్త):** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలో సంగన్నాగారి మధు ఆధ్వర్యంలో నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని వీధి విద్యుత్ దీపాలు చెడిపోవడంతో ప్రజలు రాత్రి సమయంలో వెలుతురు లేక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా మరమ్మతులకుగురైన వాటి స్థానంలో ఆదివారం నూతన వీధి విద్యుత్ దీపాలు ఏర్పాటు చెయ్యడం జరిగింది. అంతే కాకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగాన్నగారి శంకర్‌గౌడ్ గ్రామ కారోబర్ విఠల్, గోపాల్ పాల్గొన్నారు.

## సింగూరు గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

### -పాఠశాలలో వైద్య శిబిరం

**పుల్‌కల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న సింగూరు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మూడురోజులుగా విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయికిరణ్ పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు చేపడుతున్నారు. 22 మంది విద్యార్థులకు పైగా అస్వస్థతకు గురవగా స్పందించిన డాక్టర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య అందిస్తుండటంతో అనేక మంది విద్యార్థులు అనారోగ్యం నుంచి కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు పాఠశాల డాక్టర్ సాయికిరణ్ వివరించారు. విద్యార్థులు అస్వస్థతకు గురయినట్లు తెలుసుకున్న పోషకులు పాఠశాలకు చేరుకుని తమ చిన్నారులను ఇండ్లకు తీసుకుపోతున్నారు. ఈ విషయాన్ని ప్రభాతవార్త ప్రిన్సిపాల్ ఆగమయ్య దృష్టికి తీసుకుపోగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీలు,వర్షాలు కురుస్తుండటంతో విద్యార్థులు వైరల్ ఫీవర్‌కు గురయినట్లు తెలుస్తోందని, పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నామని, పోషకులు, విద్యార్థులు ఆందోళన పడాల్సిన పనిలేదని ప్రిన్సిపాల్ ఆగమయ్య పేర్కొన్నారు.

## ఆదరణ చూసి ఓర్వలేకే ప్రభుత్వంపై విషప్రచారం

**బెజ్జంకి, ఆగస్టు 17,ప్రభాతవార్త :** ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా కొరత సమస్యను రాష్ట్ర ప్రభుత్వంపై రుద్దడం విడ్డూరంగా ఉందని రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటిలో కోతలు విధిస్తూ ఆ సమస్యను రాష్ట్ర ప్రభుత్వంపై రుద్దడం సిగ్గు చేటని అన్నారు. బీజేపి పార్టీ నుండి 8మంది ఎంపిలు ఉండి కూడా రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ప్రజల్లో పార్టీపై పెరుగుతున్న ఆదరణ చూసి బీఆర్ఎస్,బీజేపి పార్టీలు ఓర్వలేకపోతున్నాయని అన్నారు.

## గొల్లపల్లిలో మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

**నర్సాపూర్ ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కేతకి భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం ఆలయ నిర్మాణ దాత బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ పూజారి వేద పండితులు హరిప్రసాద్ శర్మ వేద మంత్రాల మధ్యన శ్రీ మల్లికార్జున స్వామి కి అభిషేకం, పత్రి పూజ, నమ్మకం ,చమకం వంటి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతి ఆదివారం ఈ ఆలయంలో ఆలయ నిర్మాణదాత బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఈ మేరకు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరినీ రైతులను పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచి సమృద్ధిగా పంటలు పండే విధంగా చేయాలని ఆ భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్ గౌడ్ వాల్దాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా 'ఆపన్న హస్త మిత్ర బృందం'

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 17 (ప్రభాతవార్త):** పట్టణానికి చెందిన ఆపన్న హస్త మిత్ర బృందం ఆదివారం రెండు నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచింది. మిత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ గజ్వేల్ మండల పరిధిలోని సింగాటం గ్రామానికి చెందిన చెట్టి కరుణాకర్‌గౌడ్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రిలో చూపించుకోగా పెద్దపేగు ఇన్ఫెక్షన్ అయ్యిందని, ఆపరేషన్‌కు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అతను ఇద్దరు ఆడ పిల్లలతో ఆర్థికంగా బాధపడుతున్నాడు. అలాగే అహ్మదీపూర్ గ్రామానికి చెందిన వంక సునీత క్యాన్సర్ వ్యాధితో మంచానికే పరిమితమైంది. ఆమె భర్త మనోహర్ పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ మధ్యనే అతని తల్లి చనిపోవడం, తండ్రి పక్షవాతంతో బాధపడడం, ఇప్పుడు భార్య క్యాన్సర్ వ్యాధితో బాధపడడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరు కుటుంబాల విషయం తెలుసుకొని ఆయా గ్రామాలకు వెళ్ళి ఇరు కుటుంబాలకు రూ.20వేల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపన్న హస్త మిత్ర బృందం అధ్యక్షుడు పాశికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యాంప్రసాద్, సైదా, శైలజ, కళ్యాణి, గ్రూప్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టిఎంపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాగుల రాజు

**జగదేవ్‌పూర్, ఆగస్టు 17 (ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు ఆదివారం తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన నీలం మధుముదిరాజ్‌కు, టిఎంపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర బోయిని మహేష్, రాష్ట్ర కమిటీ బాధ్యులు అందరికీ, గజ్వేల్ నియోజకవర్గ, ముదిరాజ్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి, ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నిజాం రాజులకు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ స్ఫూర్తితో ముందుకెళ్తానని అన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన గాడిపల్లి భాస్కర్

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 17 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డుకు చెందిన దయ్యాల ఎల్లయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆదివారం ఎల్లయ్య కుమారులు దయ్యాల యాదగిరి, లక్ష్మణ్, కిష్టయ్య, కుమార్, రాజులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు గాడిపల్లి బలరాం, మహేష్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సేవలను పరిగణలోకి తీసుకోవాలి



ఆమనగల్లులో మాట్లాడుతున్న అధ్యక్షులు కృష్ణ

**ఆమనగల్లు, ఆగస్టు17, ప్రభాతవార్త:** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సంధర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయులకు స్థానం కల్పించాలని ఆమనగల్లు ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కృష్ణ అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ద్వారా ఉపాధ్యాయులు విద్యావ్యాప్తికి చేస్తున్న కృషిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక జాబితాను రూపొందించి పురస్కారాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల కేంద్రంలో శనివారం మండల ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సెప్టెంబర్5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురష్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయుల కృషిని గుర్తించాలనికోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే చేయూతతో ఆత్మవిశ్వానంపెంపొందిరాష్ట్రంలోమరింతవిద్యాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ప్రైవేటు ఉపాధ్యాయుల కృషితో పోటీ పరీక్షలలో ప్రైవేటు పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని, అలాగే ప్రైవేటువిద్యాసంస్థలలోప్రైవేటుఉపాధ్యాయులుగాపనిచేస్తూ సమాజానికి ఎంతోమంది ఉత్తమ పౌరులను అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బోడ నరేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి నజీర్, శ్రీనునాయక్, తదితరులు ఉన్నారు.

## అరవింద్‌కు ఉత్తమ కెమిస్ట్రీ అవార్డు




అవార్డును స్వీకరిస్తున్న పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, ఆగస్టు17, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని సాయిరాం మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ఫార్మసిస్టు పాపిశెట్టి అరవింద్‌కు ఉత్తమ అవార్డు వరించింది. కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు రంగంలో ఆయన సేవలను గుర్తించి రంగారెడ్డి జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు అవార్డు ప్రకటించింది. శనివారం ఆమనగల్లు పట్టణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గిన్నిస్ బుక్‌వరల్డురికార్డుఅవార్డుగ్రహీతపెండెంకృష్ణకుమార్ చేతుల మీదుగాపాపిశెట్టి అరవింద్ శాలువా సన్మానం, జ్ఞాపికను అందుకున్నారు. అవార్డు అందుకున్న అరవింద్‌ను మండల కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు ప్రతినిధులు నటరాజ్‌యాదయ్యగుప్త, ఉప్పల రాములు, పలు మెడికల్ షాపులయాజమాన్యాలు అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిసత్యనారాయణ, కోశాధికారిమహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అలవర్చాలి



మహర్షి వేద గురుకులంలో హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

షాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త: చిన్నతనము నుండే పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అలవాటు చేయాలని మహర్షి సోమ శేఖర్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని బోనగిరిపల్లి గ్రామ సమీపంలో ఉన్న మహర్షి వేద గురుకులంలో ఆదివారం హోమం నిర్వహించి, ఎనిమిది మంది పిల్లలకు ఉపనయన సంస్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు చిన్నతనము నుండే దైవచింతలను అలవర్చినప్పుడే వారు క్రమశిక్షణతో ఎదుగుతారన్నారు. భారతీయ సాంస్కృతిక, సంప్రదాయాలు మరుగున పడి పాశ్చాత్య పోకడలకు మనిషి అలవాటు పడుతున్నాడని అన్నారు. జీవనశైలిలో దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. గణపతి ఆచార్య, కేతన్ ఆచార్య, మహాజన్, పిల్లల తల్లిదండ్రులు, పాల్గొన్నారు

## ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న సిఐ కాంతారెడ్డి

**షాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని గణేష్ మండపాల నిర్వహణతో పోలీస్ స్టేషన్లో ఎస్ఐలు సతీష్, శంకర్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణేష్ మండపాలకు విద్యుత్, అగ్నిమాపక, తదితర ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజే లకు అనుమతి లేదన్నారు. గణేష్ మండపాలకు ఆన్లైన్లో అప్లై చేసుకుని, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలందరూ ఐక్యమత్యంగా ఉంటూ, భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామ్ లాల్. మండప నిర్వాకులు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా మల్లన్న స్వామి బోనాలు

**షాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డి గూడ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల పండుగ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడు శ్రావణమాసంలో జరిగే మల్లన్న స్వామి బోనాల ఉత్సవాలు గ్రామస్తులు పెద్దలతో పూజలు చేసి తమ మొక్కలు తీర్చుకున్నారు. స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మహిళలు బోనాలు తీసుకొని, శివసత్తుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలతో గ్రామస్తులంతా ఊరేగింపుగా ఆలయం వరకు బయలుదేరి, నైవేద్యం సమర్పించి తమ మొక్కలు తీర్చుకున్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచులు ప్రతాపరెడ్డి, మహేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బోకుల లింగం కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ రెడ్డి, కిషోర్ నాయక్, సూర్య బాయ్, దేవుల నాయక్, రాఘవేంద్ర స్వామి, బడుగు మల్లేష్ యాదవ్, రాహుల్, మాణిక్యం, మాధవరెడ్డి, కుమ్మరి బాలయ్య, కావలి శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, అనంతరెడ్డి, యాదయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో ఉచిత ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న చైర్మన్ సుంకిరెడ్డి

### -సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**ఆమనగల్లు, ఆగస్టు17, ప్రభాతవార్త:** విధిగా ప్రాథమిక ఆరోగ్యపరీక్షలు చేయించుకుంటే వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని ఐక్యత ఫౌండేషన్‌వ్యవస్థాపకచైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గుర్తించిన వ్యాధులకు సకాలంలో వైద్యం పొందితే సంపూర్ణ ఆరోగ్యంగాజీవించవచ్చునిఆయన వెళ్ళడించారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో ఆదివారం ఐక్యత ఫౌండేషన్ మొబైల్ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసింది. మొబైల్ క్యాంపు ద్వారా ప్రజలకు ఉచిత ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. మెడిహబ్ ఆసుపత్రికి చెందిన నిపుణులు ఆరోగ్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలిరోజు శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 600 మంది హాజరుకాగా 400పైగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. రక్త నమూనాలు సేకరించి సిబిపి(కంప్లీట్ బ్లడ్‌పిక్చర్)నిర్వహించి ఆరోగ్యస్థితిగతులను వివరించారు. క్రియోటినిన్, యూరిన్, బిలిరుబిన్, కొలెస్ట్రాల్, కాల్షియం, గ్లూకోజ్ వంటిపరీక్షలు చేశారు. ఈసంధర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సభలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలఆరోగ్యసంరక్షణకుఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చేపడుతున్నట్లు ఆయన వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య భారంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి అండగా నిలబడాలనే ఆశయంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సుంకిరెడ్డి తెలిపారు. ఇంతకు ముందు మెగా కంటి ఆరోగ్య పరీక్షలు చేపట్టి ఉచితంగా కంటి అద్దాలు పంపిణతోపాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టాలనే సంకల్పంతో ఉచితంగా మొబైల్ హెల్త్ క్యాంపులకు శ్రీకారం చుట్టామని వివరించారు. క్యాంపుల ద్వారా రక్తపరీక్షలు చేసి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ ంలోని అన్ని మండలాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని ప్రతిగడపకు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. మొబైల్ హెల్త్ క్యాంపులకు ప్రజల నుండి వస్తున్న స్పందన అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, మాజీ ఉపసర్పంచ మల్లేశ్‌నాయక్, పురుషోత్తం, చంద్రునాయక్, కిషన్‌నాయక్, కుమార్, మల్లేశ్, నవీన్, తావ్‌నాయక్, తక్రియ, టాక్య, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులురచ్చ శ్రీరాములు, శివ, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, రాఘవేందర్, ఉన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

## భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



నందిగామలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ ఆగస్టు17 ప్రభాతవార్త :** పవిత్ర శ్రావణమాసం పుణ్య దినాలలో భగవంతుని కరుణా కృప కటాక్షం ప్రజలందరిపై ఉండాలని భగవంతుని వేడుకుంటున్నానని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఆదివారం నందిగామ మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి కవిత దంపతులు తమ స్వగృహంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి రథ పూజల్లో పాల్గొన్నారు. వరుణ దేవుని ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పూజలో షాద్నగర్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కృష్ణారెడ్డి, ఏంసి డైరెక్టర్లు సి నర్సింలు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ర్నారెడ్డి, డైరెక్టర్ కుందారం వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీలు చెంది తిరుపతిరెడ్డి, దామోదర్ రెడ్డి, చంద్రపాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ, కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, కావలి కృష్ణ, దాసరి నర్సింలు, ఇన్ముల్ నర్వ సుదర్శన్‌రెడ్డి, కుందారంర్నా రెడ్డి, ఎదురే శ్రీకాంత్‌గౌడ్, బి జంగయ్యగౌడ్, తుమ్మల నరసింహులు యాదవ్, ఎర్రగారి రమేష్, యాదగిరి, బిలింగం లు ఉన్నారు.

## సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళా కూలీలు



వరి నాట్లు వేయడానికి వెళ్తున్న మహిళా కూలీలు

**(నందిగామ, ఆగస్టు 17 ప్రభాతవార్త)**రోజు బస్సుల్నోస్త.. వరి నాట్లేస్తం.. ముదురుదేవ్వత..పత్తిచేనుకుమంద్నేస్త..జొన్నసేన్లు కల్నుస్త..పొదుమూకి మల్ల బస్సులో ఇంటికొస్త. సీఎం సార్ కడుపు సల్లగ్నుడ ఆధార్ కార్డు చూపెద్నత టికెట్ తీసుకుంన్నట. రోజు బస్సు చార్జీలు మిగిలి మాకు ఆ దేరువవుతుంది. కూరగాయలు కొంటాం, కళ్ళుతాగ్నుత, ఆకుజరద కొన్నట.మాకు మంచిగున్నది బిడ్డ.. పని దొరకని నాడు పట్నం పోత. దేవుళ్ళ కాడికి వ్నెళ్త. దర్గాకోత.. మా బిడ్డ తానికోత.. సీఎం సారు మా ఆయుష్షు కూడ పోసుకొని నూరేళ్లు బతకాలని దినసరి మహిళా కార్మికులు, మహిళ వ్యవసాయ కూలీలు దీవిస్తూ మురిసిపోతున్నారు. రోజు కూరగాయలమ్మేవారు, పాలు పెరుగమ్మేవారికి కాయకష్టం చేసుకోని బ్రతికే వారికి ఉచిత బస్సు ద్వార ఎంతో మేలు జరుగుతుందన్నారు.

## బండోనిగూడలో సిసి రోడ్లు నిర్మాణం ప్రారంభం..

**(నందిగామ ఆగస్టు 17 ప్రభాతవార్త :** నందిగామ మండలం బండోనిగూడ గ్రామంలో ఆదివారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుల బుచ్చయ్య ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు గ్రామశ్రీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జాలగుడెం రాజు, ఉపాధ్యక్షుడు బక్కోళ యాదయ్య, నాయకులు కే. పాండు బి. మల్లేష్, జె. జనార్ధన్, జె. మల్లేష్, పి. శ్రీకాంత్, పి. బాలరాజు, బండ మల్లేష్, బుడమోళ శ్రీశైలం, మంచంపాటి సమూలయ్య, బండ పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు

## సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శిగా కురుమయ్య



చీపునంతల గ్రామ కార్యదర్శి గా కురుమయ్యన ఎంపిక చేసిన సిపిఎం నాయకులు ఎన్నికైన కురుమయ్య

**తలకొండపల్లి, ఆగస్టు17, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో సిపిఎం గ్రామ కార్యదర్శిగా కురుమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం ఆమంగల్ ఏరియా కమిటీ కార్యదర్శి పిప్పళ్ళ శివశంకర ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమై గుమ్మడి కురుమయ్యను గ్రామ శాఖ కార్యదర్శి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ గ్రామ సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని ప్రభుత్వం అందజేసే పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా పనిచేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆమనగల్ ఏరియా కమిటీ కార్యదర్శి పిప్పళ్ళ శివశంకర్, తొగరిపోచయ్య, కుట్ర మల్లేష్ మిడత రాజు నీరెడ్డి ప్రవీణ్ గుమ్మడి మల్లేష్ తదితరులున్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండలఅధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్

**తలకొండపల్లిఆగస్టు17, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ..జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి, తీరా స్థానిక ఎన్నికల ముందు పార్టీపరంగా రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ..బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్తామని ఏడాదిన్నర కాలంగా స్థానిక ఎన్నికలను ఆపినా సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు కూడా రిజర్వేషన్ కల్పించిన తర్వాత నే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు... బీసీలను మభ్య పెట్టాలని చూడొద్దని, రిజర్వేషన్ సాధనకు ప్రభుత్వంతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని అని తెలిపారు. త్వరలో మండలంలో బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, బీసీ సమాజాన్ని చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి బీసీలకు రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్మించాలని ఆయన మరోసారి డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శులు వట్టేల శ్రీశైలం యాదవ్, గోదా నరసింహ గౌడ్, కోవి సుబ్రమణ్యం, వట్టేల శేఖర్ యాదవ్, రాజమణి కృష్ణ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణంపై మండిపడుతున్న ప్రజలు

### ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరిక

**నవాబుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త :** అభివృద్ధికి చిహ్నం సరైన రవాణ వ్యవస్థ అందులో ప్రధాన భూమిక రోడ్లది. ఈనేపథ్యంలో రోడ్లు సక్రమంగా ఉన్నపుడు ఆప్రాంతంఅభివృద్ధికి నోచుకుంటుంది. మండలానికి ప్రధానమైన ఆర్ అండ్ బీ రోడ్డు వికారాబాద్ మండలం పరిధి బంగారు మైసమ్మ ఆలయం నుండి మండల మీదుగా దాదాపు 20 కిలోమీటర్ల పొడవు సరిహద్దు గ్రామం మైతాబ్‌ఖాన్‌గూడ వరకు రోడ్డు ఉంది. ఈ రోడ్డు ధ్వంసం కావడంతో మండల ప్రజలు గగ్గోలు పెట్టి, నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించడం, స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం, విమర్శలు ప్రతి విమర్శలు గుప్పించుకోవడం లాంటి కార్యక్రమాలు చేపడితే, ఎట్టకేలకు పుణనిర్మాంకోసం అధికారులు 14 కోట్ల రూపాయలకు పైగా నిధులనుమంజూరు చేశారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య కృషి ఎంతగానో ఉంది. దీంతో హట్టహసంగా కొన్ని సంత్సరాల క్రితం పనులను ప్రారంభించారు. కానీ నేటికీ పనులు పూర్తి కాలేదు. దీంతో ఈ రోడ్డు గుండా ప్రాయాణం చేయాలంటే వాహన చోధకుల వెన్నులోవనుకు పుడుతుంది. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పనులు కొంత భాగాన్ని పూర్తి చేసినా, కొంత భాగాన్ని మధ్యలో వదిలేశారు ప్రస్తుతం రోడ్ల విషయం మండలంలో చర్చనీయాంశమైయింది. ఉరిమి ఉరిమి మంగళం మీద పడిన చంధంగా నాడు నేడు ఎమ్మెల్యేనే టార్‌గెట్ చేస్తూ నాయకులు విమర్శలు ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. కాంట్రక్టర్లు స్థానికులు కావడం నాయకులు వారికి తోత్తులుగా ఉండటంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని పరిశీలకులు భావిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా మండల ప్రజలకు ఈ విషయం చర్చనీయాంశం కావడం విశేషం. ఇంత పెద్ద వ్యవస్థ ఉండగా ప్రజల గోస చూసి మండల పరిధిలోని పులుమామిడి గ్రామానికి చెందిన ఓ సాధరణ వ్యక్తి తన స్వంత నిధులతో ప్రధాన రోడ్డు గుంతల్లో మట్టి పోయించి కొంత ఊరట కలిడించడం పట్ల సర్వాత్ర అభినందించడం విశేషంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్ల విషయంలో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాలస్వామి

**ఘట్‌కేసర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలు శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం శాంతతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గణేశ్ ఉత్సవాల నిర్వహకులు, అన్ని మతాల పెద్దలతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. వినాయక ఉత్సవాలు జరిపే వారు పోలీసుల ఆదేశాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా గణేశ్ మండపాలను ఏర్పాటు చేయాలని నిమజ్జనం సమయంలో ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు. పోలీసు శాఖ నిబంధనలను పాటించి మండపాల సమాచారం ఇవ్వాలని, విద్యుత్ అనుమతి పొందాలన్నారు. ఎస్ఐలు శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, మాజీ ఎంపిటిసి గోపాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి.ఇక్బాల్, నాయకులు ముల్లి జంగయ్యయాదవ్, అంజనేయులు, రవికాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, అబ్దుల్‌అజీజ్, కుతుబుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవసంఘం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఘట్‌కేసర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగంలో త్రైత సిద్దాంతము సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీకృష్ణభగవాన్‌కి పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో జరుపుకునే శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పళ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడను స్వామికి నైవేద్యంగా పెట్టి శ్రీకృష్ణ కీర్తనలు పాడారు. మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్ శ్రీకృష్ణ పూజలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి సమర్పించారు. ఈకార్యక్రమంలో మైసయ్య, కేస్కార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాదవ సంఘంలో అధ్యక్షులు రాజబోయిన యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్‌తో పాటు ఆమె పాల్గొని మాట్లాడారు. శ్రీకృష్ణునికి నైవేద్యం ఆరగింపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు రామకృష్ణయాదవ్, ప్రధానకార్యదర్శి వీరేందర్‌యాదవ్, చిత్తారియాదవ్, సత్యనారాయణ, అంజనేయులు, పొన్నయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ఆర్మీ మేజర్ నరేశ్‌గౌడ్‌కు సన్మానం

**ఘట్‌కేసర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ఆర్మీ మేజర్ పల్లె నరేశ్‌గౌడ్‌కు ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి సన్మానం చేశారు. పోచారం మున్సిపల్ నారపల్లిలోని మాజీ ఎంపిటిసి పల్లె మాధవ బిక్షపతిగౌడ్ కుమారుడు ఆర్మీ మేజర్ నరేశ్‌గౌడ్‌ను ఆయన కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాత్మక సాయుధదళాల శక్తి మేరకు ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని ఇంటికి విచ్చేసి నరేశ్‌ను అభినందించి సత్కరించారు. త్రివిధ దళాలకు అందిస్తున్న ఆధునాతన యుద్ధ సామాగ్రి అనుక్షణం సైన్యానికి నైతిక స్థైర్యం పెంచిన వివరాలపై మేజర్‌తో సుదర్శన్‌రెడ్డి చర్చించారు.

## సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలి

**శామీర్‌పేట, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహాసభల్లో పలు తీర్మాణాలు ప్రవేశపెట్టటం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డిజి సాయిలుగౌడ్ పేర్కొన్నారు. శామీర్‌పేట సొసైటీ చైర్మన్, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డిని సిపిఐ నాయకులు కలిసి సిపిఐ రాష్ట్ర మహాసభల కోసం విరాళాలు సేకరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘాల బలోపేతంకు, కౌలురైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పనిముట్లు అందించాలని, పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించాలని రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని మహాసభల్లో పలు తీర్మాణాలు ప్రవేశపెట్టటం జరుగుతుందన్నారు. రైతులు, ఈ నెల 20నుంచి 23వ తేదీ వరకు రాష్ట్ర సిపిఐ 4వ మహాసభలు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని గాజులరామారంలో జరుగుతున్నట్లు డిజి సాయిలుగౌడ్ వివరించారు. అదే విధంగా సొసైటీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, డైరక్టర్ వంగ భూమిరెడ్డి కూడ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు డిజి సాయిలుగౌడ్‌తో పాటు శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్, మూడుచింతలపల్లి మండల కార్యదర్శి టి.రాములుగౌడ్ పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న నలుగురిపై కేసు నమోదు




**తలకొండపల్లి ఆగస్టు17, ప్రభాతవార్త :** మనగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం....శుక్రవారం తలకొండపల్లి ఎక్స్ రోడ్ దగ్గర తలకొండపల్లి ఎస్సై కె.శేఖర్ మరియు వారి సిబ్బంది వాహనాలు తనిఖీ చేయుచుండగా ఒక స్విఫ్ట్ కారు కడ్తాల్ వైపు నుండి తలకొండపల్లి ఎక్స్ రోడ్ వైపు వస్తుండగా అట్టి స్విఫ్ట్ కారును పోలీసులు ఆపుతుండగా కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారు ఆపి పారిపోతుండగా పోలీసులు పట్టుకొని చెక్ చేయగా ఒక పార్సెల్ కవర్ అనుమానాస్పదంగా కనిపించింది. దాంతో పోలీసులు దాన్ని కట్ చేసి చూడగా అందులో నుంచి ఘాటైన వాసన కాగిన గంజాయి ఉంది. వెంటనే ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి గంజాయిని, మరియు ఒక స్విఫ్ట్ కారును రెండు సెల్ ఫోన్స్ ను స్వాధీనం చేసుకొని నిందితుల గురించి తెలుసుకునగా తలకొండపల్లి గ్రామానికి చెందిన పద్మ వెంకటేష్, కట్టమళ్ల రఘువరన్ గా గుర్తించారు. తర్వాత ఈ గంజాయి మీకు ఎక్కడి నుంచి వచ్చిందని ఇద్దరినీ విచారించగా పద్మ వెంకటేష్ స్నేహితులు హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతానికి చెందిన జోగు రాజు, పిల్లి ప్రణయ్ అనే నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుండి 287 గ్రాముల గంజాయి, ఒక స్విఫ్ట్ కారు, ఒక స్కూటీ మరియు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితులను ఈ రోజు రిమాండ్ కు తరలించారు. కేసు లో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ కె.శేఖర్, క్రైమ్ కానిస్టేబుల్ బి.జాషువా, కానిస్టేబుల్ శ్రీను,

## ముత్యాలమ్మ బోనాలకు హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి

**తలకొండపల్లి ఆగస్టు 17, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల రామకృష్ణాపురం గ్రామంలో ఆదివారంనాడు నిర్వహించిన ముత్యాలమ్మ బోనాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. గ్రామంలోని ముత్యాలమ్మ దేవతకు గ్రామస్తులు బోనాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవత ఆశీస్సులు గ్రామస్తులు అందరికీ ఉండాలని, గ్రామంలో పంటలు విరివిగా పండే గ్రామస్తులందరు సుఖశాంతులతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జోగు రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మెదక్ పల్లిలో కోట మైసమ్మ విగ్రహం ప్రతిత్తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన కోట మైసమ్మ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్టించారు. గ్రామంలో నీ కోట మైసమ్మ దేవాలయం నీ కోట మైసమ్మ దేవాలయం చిత్రవస్థకు శిథిలావస్థకు చేరుకోవడంతో కసిరెడ్డి యాదగిరి రెడ్డి చొరవ తీసుకొని నూతనంగా దేవాలయాన్ని నిర్మించి ఆదివారం నాడు గ్రామస్తులందరితో కలిసి కోట మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే నర్సిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి యాదిరెడ్డి సుధాకర్ రెడ్డి అల్వాల్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నార